రైతుబంధు అడిగితే చెప్పుతో కొడ్తరా?

- కాంగ్రెస్ నేతలను ఏ చెప్పతో కొట్టాలి?
- రుణమాఫీ డిసెంబర్ గడువు ఏమాయె?
- నమ్మినఆటో కార్మికులను ముంచారు
- దొంగ అన్నఅదానీతో అలయ్‌బలయ్
- కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- ఓటుతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి
- లోక్‌సభ ఎన్నికల్లో మన గెలుపే లక్ష్యం
- కరీంనగర్‌లో సోషల్‌మీడియా వారియర్స్‌సమావేశంలో కేటీఆర్



బుధవారం కరీంనగర్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రైతు బంధు పడలేదని అడిగితే చెప్పుతో కొడతారా? ఇంత అహంకారమా? అని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుబంధు ఇవ్వలేని కాంగ్రెస్ నాయకులను ఏ చెప్పుతో కొట్టాలని ఫైరయ్యారు. 'రైతులారా! రైతు బంధు ఇవ్వని ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓటుతో కొడతారో మీ ఇష్టం' అని అన్నారు. చెప్పుతో కొడతానన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. బుధవారం కరీంనగర్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో వచ్చిన వారియర్స్‌కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఎం మోదీకి కలిశాకే రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ వచ్చిందని గుర్తుచేశారు. ఈ రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను అణచివేసే కుట్ర చేస్తున్నాయని తెలిపారు.

డిసెంబర్ 9నే రుణమాఫీ అని అబద్ధాలు

'రుణాలు తీసుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే తీసుకోవాలని, డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ పార్టీ రద్దు చేస్తుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. కానీ ఫిబ్రవరి 9 వస్తున్నా ఇప్పటి వరకు రుణమాఫీ విషయం మాట్లాడటం లేదు. కాంగ్రెస్ ఇచ్చినవి ఆరు గ్యారెంటీలు మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, యువత, రైతుల పేరిట చేసిన డిక్లరేషన్ ప్రకారం చూసుకుంటే 420 హామీలు ఉన్నాయి. ఈ 420 హామీలు నిలబెట్టక పోతే కాంగ్రెస్ బట్టలు ఊడగొట్టక తప్పదు' అని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని, జనవరి నుంచి కరెంట్ బిల్లులు కడతామని పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని స్పష్టం చేశారు. అనుభవం ఉన్న కేసీఆర్ పైసాపైసా కూడబెట్టి 70 లక్షల మంది రైతులకు వారంలో రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. గుంపు మేస్త్రీగా అనుకునే రేవంత్‌రెడ్డికి రైతుబంధు ఎట్లియ్యాలో తెలియడం లేదని ఎద్దేవాచేశారు. రైతు బంధు పేరును రైతు భరోసా అని మార్చి డూప్లికేట్ మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హామీలు నెరవేర్చకపోతే రైతులు చీరి చింతకు కడతారని వెల్లడించారు. రైతుల పక్షాన పోరాడాలని సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. ఆటో కార్మికులు నమ్మి ఓటేస్తే వాళ్ల కొంప కొల్లేరు చేశారని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఆర్టీసీలో ఫ్రీ, ఫ్రీ అని అంటే ఇప్పుడు సీట్ల కోసం మహిళలు కొట్టుకునే పరిస్థితి వచ్చిందని, పైసలు పెట్టి టికెట్లు కొనుక్కునే పురుషులు కూడా తిట్టుకోవల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. బీఆర్ఎస్‌కు రెండు సార్లు అవకాశం ఇచ్చిన ప్రజలను, ఇప్పుడు సోషల్ మీడియాలో నిందించటం మంచిది కాదని వారియర్స్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజల మనసును మళ్లా ఎట్లా గెలుచుకుందాం? వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎలా ఎగురవేద్దాం? అన్న దిశగానే ఆలోచించాలని, ప్రజా తీర్పును అవమానించొద్దని సూచించారు.

బీజేపీ ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్సే

బీజేపీలో పెద్ద నేతలమని చెప్పుకుంటున్న బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, సోయం బాపూరావును ఓడించింది ఏ పార్టీ? అని, రాజాసింగ్‌ను దాదాపు ఓడించింది ఏ పార్టీ? అని కేటీఆర్ ప్రశ్నించారు. వీళ్లందరినీ ఓడించింది బీఆర్ఎస్సే అని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సోషల్ మీడియా అత్యంత శక్తిమంతమైనదని, తప్పుడు ప్రచారాన్ని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధిని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, ఒడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, పలు జిల్లాల జడ్పీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభకు కేటీఆర్ పరామర్శ

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమెను, కుటుంబసభ్యులను కేటీఆర్ బుధవారం పరామర్శించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వేంకటేశ్వరపల్లికి వెళ్లి గాలన్న చిత్రపటానికి నివాళి అర్పించారు. కేటీఆర్ వెంట నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ముందు దొంగ అని తిట్టిన అదానీతో కౌగిలింతలు

'ఎన్నికల ముందు అదానీని దొంగ అని తిట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు విదేశాల్లో కౌగిలించుకుని ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంస్థలను అదానీకి అప్పగించాలని చూస్తున్నారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. అదానీ మోదీ మనిషి అని తెలిసే కేసీఆర్ తెలంగాణలో అడుగుపెట్టనీయ లేదని, ఇప్పుడు తెలంగాణలో అదానీ అడుగుపెట్టడమే కాదు.. భవిష్యత్తులో విద్యుత్తు, ప్రభుత్వ సంస్థలను, కాంట్రాక్టులను అదానీకి ఇవ్వడానికి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఈ రెండు పార్టీల మధ్య జరుగుతున్న చీకటి ఒప్పందాలు, రహస్య సంబంధాలను ఎండగట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ఏక్‌నాథ్‌షిండే అయినా ఆశ్చర్యపోనక్కర లేదని వ్యాఖ్యానించారు.

లోకం పోకడ



ఐఆర్డీ సీఈవోగా కాత్యాయనీ దేవి

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): వెయిటింగ్‌లో ఉన్న ఐదుగురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. మరో అధికారిని బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మైన్స్ అండ్ జియాలజీ విభాగం డైరెక్టర్‌గా ఉన్న కాత్యాయనిదేవిని టీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఐఆర్డీ) సీఈవోగా బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారుల్లో ఎన్ శ్రీధర్‌కు ఎస్సీ అభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా, అమయ్‌కుమార్‌కు పశుసంవర్ధకశాఖ సంయుక్త కార్యదర్శిగా, వినయ్ కృష్ణారెడ్డికి వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శిగా, ఎస్ హరీశ్‌కు రోడ్లు, భవనాలశాఖ సంయుక్త కార్యదర్శిగా, సుశీల్‌కుమార్‌కు మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.

టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమాస్తులు 100 కోట్లు

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ ఇంట్లో సోదాలు
- 14 బృందాలతో 20 చోట్ల ఏకకాలంలో..
- 20 కోట్ల నగదు, నగలు సీజ్‌చేసిన ఏసీబీ

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రెరా కార్యదర్శి, గతంలో హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయం, ఆయన బంధువుల ఇండ్లపై ఏసీబీ ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిసింది. 14 బృందాలు 20 చోట్ల చేపట్టిన ఈ సోదాలు బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. మణికొండలోని ఆదిత్యఎన్‌క్లేవ్ వ్యూలో విల్లా నంబర్ 25లో శివబాలకృష్ణ నివాసం ఉంటున్నారు. 2018 నుంచి 2023 వరకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, ఆరు నెలల క్రితం రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ ఆథారిటీ) కార్యదర్శిగా బదిలీ అయ్యారు. మెట్రోరైల్ ప్లానింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివబాలకృష్ణపై అవినీతి ఆరోపణలు రావటంతో ఆయన ఆస్తుల చిట్టాపై ఇటీవల ఏసీబీ ఆరా తీసింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆధారాలు సేకరించి.. సోదాలు నిర్వహించింది. ఇందులో రూ.20 కోట్ల నగదు, ఖరీదైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వాచ్‌లు, కిలోలకొద్దీ బంగారు, వెండి ఆభరణాలు, విలువైన బహుమతులు, వందల సంఖ్యలో డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలిసింది. గురువారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశాలున్నాయంటూ ఏసీబీ అధికారులు వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్టు వివరించారు.

హెచ్‌ఎండీఏలో కలవరం

శివబాలకృష్ణ ఇంట్లో ఏసీబీ సోదాలు హెచ్‌ఎండీఏలో కలకలం రేపాయి. ఏసీబీ దాడుల సమాచారంతో అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగం(ప్లానింగ్)లో నిశ్శబ్దం నెలకొన్నది. ఏసీబీ అధికారులు కార్యాలయంలోనూ సోదాలు చేస్తారన్న ప్రచారంతో ఉన్నతాధికారులు ఆందోళనకు గురయ్యారు.

శివబాలకృష్ణ ఇంట్లో ఏబీసీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు, నగలు, విలువైన వస్తువులు

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	16.4°c	34.3°c
కరీంనగర్	17.0°c	29.0°c
మెదక్	17.9°c	33.4°c
ఆదిలాబాద్	19.0°c	30.8°c
ఖమ్మం	19.0°c	31.0°c
నిజామాబాద్	19.1°c	32.3°c
నల్లగొండ	20.2°c	33.3°c
హైదరాబాద్	20.8°c	31.2°c
మహబూబ్‌నగర్	21.0°c	33.0°c
వరంగల్	21.0°c	31.0°c

చివరివరకు కేసీఆర్‌తోనే

- మాపై దుష్ప్రచారం చేస్తున్నారు
- ప్రచారం ఆపకుంటే పరువునష్టం దావా
- ప్రజా సమస్యల కోసమే సీఎంను కలిశాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): జీవితంలో చివరి అంకం వరకు తాము బీఆర్ఎస్‌లోనే ఉంటామని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టంచేశారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం, భద్రతాపరమైన చర్యలు, ప్రొటోకాల్ సమస్యల పరిష్కారం కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు వివరించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎంను కలిసినంత మాత్రాన పార్టీ మారుతామని ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. తాము పార్టీ మారుతున్నట్టు కాంగ్రెస్ నాయకుల తోపాటు సోషల్ మీడియాలోనూ ప్రచారం చేస్తున్నారని, దీనికి ఫుల్‌స్టాప్ పెట్టకుంటే పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ గెలుపుకోసం కృషి చేస్తామని తెలిపారు.

అధిష్ఠానానికి మాపై సంపూర్ణ విశ్వాసం

"ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ కప్పదాటు వైఖరి ప్రదర్శిస్తున్నది. నా నియోజకవర్గంలో ప్రొటోకాల్ వివాదాలపై ఇప్పటికే చెప్పా. ఇదే విషయం మీద ఐజీ శివధర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని కలిశాం. స్థానిక అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మేం పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలను ఖండిస్తున్నా. ప్రజల్లో గందరగోళం సృష్టించి మమ్మల్ని అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. మేం కేసీఆర్ వెంటే ఉంటాం. కేసీఆర్ సారథ్యంలో మెదక్ పార్లమెంటు స్థానం గెలుచుకుంటాం. నాపై దుష్ప్రచారం ఆపకుంటే పరువునష్టం దావా వేస్తా.

- సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

బతికున్నంతకాలం బీఆర్ఎస్‌తోనే

స్థానిక సమస్యలపై ఎస్సీ, కలెక్టర్‌ను ఇదివరకే కలిశాం. వాటికి కొనసాగింపుగానే శివధర్‌రెడ్డిని, సీఎం రేవంత్‌ను కలిశాం. నేను బతికున్నంత కాలం బీఆర్ఎస్‌తోనే ఉంటా. కేసీఆర్ నన్ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేను చేశారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం. అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్ హయాంలో జోడెడ్లలా సాగాయి. మెదక్ ఎంపీ స్థానాన్ని మూడునాలుగు లక్షల మెజార్టీతో కైవసం చేసుకుంటాం. నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కాలేజీ మంజూరైంది. దాని పనులు కొనసాగించాలని సీఎంను కోరాం.

- గూడెం మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే

పుట్టింది, సచ్చేది ఇక్కడే

నేను రాజకీయంగా పుట్టింది బీఆర్ఎస్‌లోనే. సచ్చేది కూడా బీఆర్ఎస్‌లోనే. నా ప్రయాణం జీవితాంతం కేసీఆర్‌తోనే. కేసీఆర్ నాకు ఎమ్మెల్యేగా రాజకీయ జన్మ ఇచ్చారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సీఎంను కలిశా. సీఎం కేసీఆర్‌గా ఉన్నపుడు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు జహీరాబాద్‌కు మంజూరు చేశారు. జరుగుతున్న పనులను ఆపాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇలాంటి వాటికి ఆస్కారం ఇవ్వొద్దని, మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులు ఆపొద్దని కూడా కోరా. భద్రతకు సంబంధించిన అంశాలపైనా కూడా సీఎంతో మాట్లాడాం.

- మాణిక్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ ఓ ఎండ్రకాయల పార్టీ

నియోజకవర్గ సమస్యలపైనే కాంగ్రెస్‌ను కలిశాను. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌కు కాదు, రాష్ట్రానికి సీఎం. ఆయనను కలవడం తప్పెలా అవుతుంది. కాంగ్రెస్ ఓ ఎండ్రకాయల పార్టీ. అందులో ఎవరు చేరుతారు? 2001 నుంచీ కేసీఆర్‌తోనే ఉన్నా. ఇకపైనా ఉంటా. మేం కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ఆ పార్టీ వారే దుష్ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో మాపై విష ప్రచారం చేస్తున్నారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిని కలిసి మల్లన్నసాగర్ నుంచి నీళ్లివ్వాలని కోరాను. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. మాపై ఓడినవారు అధికారం చెలాయిస్తున్నారు. నియోజకవర్గ సమస్యల కోసం సీఎంను నెలకోసారి కలుస్తా. దుష్ప్రచారం చేస్తే మాత్రం ఊరుకోను. - కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

ఎమ్మెల్సీల తిరస్కరణపై విచారిస్తాం

- హైకోర్టులో కీలక పరిణామం
- గవర్నర్ తిరస్కరణ చర్యపై న్యాయ సమీక్ష పరిధిపై విచారణ
- వెల్లడించిన రాష్ట్ర హైకోర్టు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీగా ఇద్దరి పేర్లను గవర్నర్ తిరస్కరించిన వ్యవహారంపై సమగ్ర విచారణ చేస్తామని హైకోర్టు ప్రకటించింది. సాంకేతిక అంశాల పేరుతో వ్యాజ్యాలపై విచారణ ముగించబోమని వెల్లడించింది. గత కేసీఆర్ ప్రభుత్వం శాసనమండలిలో రెండు ఖాళీల భర్తీకి చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడంపై సమగ్ర న్యాయ విచారణ చేపడతామని తెలిపింది. పిటిషన్ల విచారణార్హతతోపాటు గవర్నర్ నిర్ణయంపై న్యాయసమీక్ష పరిధిపై కూడా విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ఎమ్మెల్సీగా నియమించాలని మంత్రివర్గ ఆమోదం మేరకు గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను గవర్నర్ తిరస్కరించడాన్ని దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఆ పిటిషన్ల విచారణార్హతపై ఫిబ్రవరి 8న పూర్తి స్థాయిలో వాదనలు వింటామని ప్రకటించింది. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ మంత్రిమండలి సిఫారసు చేసిన ఎమ్మెల్సీ నామినేషన్లను గవర్నరు తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ వారిద్దరూ దాఖలు చేసిన వేర్వేరు వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది.

కౌంటర్ పిటిషన్ దాఖలు చేస్తాం

ఈ వ్యవహారానికి సంబంధించి ప్రభుత్వ వాదనలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేస్తామని అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంది వాదనలు వినిపిస్తూ, గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పారు. మంత్రివర్గం తీసుకునే నిర్ణయానికి గవర్నర్ ఆమోదం చెప్పాల్సిందేనని అన్నారు. మంత్రి మండలి సలహా మేరకు గవర్నర్ నిర్ణయం తీసుకుని తీరాలని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో గవర్నర్‌కు ఎలాంటి విచక్షణాధికారం లేదని తెలిపారు. గత జూలైలో శ్రవణ్, సత్యనారాయణ పేర్లను ఎమ్మెల్సీగా నియమించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసిందని, దీనిని గవర్నర్‌కు నివేదిస్తే ఆ రెండు పేర్లకు ఆమోదం చెప్పకుండా నిరుడు సెప్టెంబర్ 19న తిరస్కరించారని చెప్పారు. గవర్నర్ తన పరిధిని దాటి వ్యవహరించారని, రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గం చేసిన సిఫార్సులను గవర్నర్ ఆమోదించి తీరాలని తెలిపారు. గవర్నర్ నిర్ణయాలను న్యాయసమీక్ష చేయడానికి వీల్లేదంటూ పిటిషన్ల హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని రద్దు చేయాలని కోరారు. రాజ్యాంగంలోని 361వ అధికరణలో నిర్దేశించిన మేరకు అభ్యంతరాలను వ్యక్తం చేయడాన్ని తప్పుపట్టారు.

పిటిషన్ విచారణార్హతపై అభ్యంతరాలు

గవర్నర్ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది అశోక్‌ఆనంద్‌కుమార్ ప్రతివాదన చేస్తూ, రాజ్యాంగంలోని అధికరణ 361ప్రకారం పిటిషన్ విచారణార్హతపై అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఆ దశలో ఏజీ కల్పించుకొని అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న కారణంగా తదుపరి విచారణ వరకు ఎమ్మెల్సీల నియామాకాలు చేపట్టరాదన్న నిషేధం ఉన్నట్టుగా భావిస్తున్నట్టు చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని చెప్పింది. ఈ వివాదాన్ని పరిగణనలోకి తీసుకున్న గవర్నర్ ఎమ్మెల్సీల నియామక వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకోరాదనే నిర్ణయం తీసుకున్నారని గవర్నర్ తరపు న్యాయవాది చెప్పారు. కోర్టులో వివాదం తేలేదాకా గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోరని చెప్పారు.

గవర్నర్‌కు విచక్షణాధికారాల్లేవు

'గవర్నర్ వ్యక్తిగత అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం. గవర్నర్ కోటా కింద శాసనమండలిలో ఖాళీలను భర్తీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. మంత్రివర్గ ఆమోదానికి అనుగుణంగా సాహిత్యం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో అనుభవం ఉన్న వారిని నామినేట్ చేసే అధికారం ప్రభుత్వానికే ఉంటుంది. గవర్నర్ ప్రభుత్వ సిఫార్సును తిరస్కరించడం రాజ్యాంగ వ్యతిరేకంగా ప్రకటించాలి. రాజ్యాంగం ప్రకారం మంత్రివర్గ సిఫార్సులకు గవర్నర్ ఆమోదించి తీరాలి. గవర్నర్ నిర్ణయం ఏకపక్షం. చట్ట విరుద్ధం. గవర్నర్ తన అధికార పరిధిని దాటి వ్యవహరించారు. మంత్రివర్గ సిఫార్సులను ఆమోదించడం గవర్నర్ కార్యనిర్వహక విధి. రాజ్యాంగంలోని 171(5) అధికరణం ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారాలు లేవు. ఆ అధికరణంలో గవర్నర్‌కు 'ప్రత్యేక విజయాల' ప్రస్తావన లేనప్పటికీ, పిటిషనర్ల సామర్థ్యంపై అంచనాకు వచ్చి తిరస్కరించడం చెల్లదు' అని ఇద్దరు పిటిషనర్లు తమ వ్యాజ్యాల్లో పేర్కొన్నారు.

చదువుకున్నోళ్లందరికీ ఉద్యోగాలివ్వలేం!

▶ మొదటిపేజీ తరువాయి...

కళాశాలలోని ప్రతి విభాగంలో యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. త్వరలోనే 60 వేల మంది టీచర్లు రిటైర్ కాబోతున్నారని, మెగా టీచర్స్ జాబ్‌మేళాను సీఎం ప్రకటించారని తెలిపారు. ఫిబ్రవరిలోనే రిక్రూట్‌మెంట్ ఉంటుందని పేర్కొన్నారు. ఒక్క పర్యటనలోనే ఆలేరు నియోజకవర్గానికి రూ.100 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందిస్తామని, బస్వాపూర్ ప్రాజెక్టుతోపాటు గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తిచేస్తామని వివరించారు. ఈ నెల 26న నల్లగొండలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈవోతో సమీక్ష నిర్వహించారు.

కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- కాంగ్రెస్‌కు 11మంది కౌన్సిలర్ల మద్దతు
- అవిశ్వాసం నెగ్గినట్టు ప్రకటించిన ఆర్డీవో
- కోర్టు నుంచి స్టే తెచ్చిన చైర్‌పర్సన్ శిరీష

కోస్గి, జనవరి 24: నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం కోస్గి మున్సిపల్‌లో కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన ప్రక్రియను ఆర్డీవో రాంచందర్‌నాయక్ సమక్షంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ సమావేశం నిర్వహించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా కాంగ్రెస్‌కు చెందిన 11 మంది కౌన్సిలర్లు హాజరై చేతులు ఎత్తి అవిశ్వాసాన్ని బలపర్చడంతో తీర్మానం నెగ్గింది. అయితే కొంత సమయం తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష అవిశ్వాస తీర్మానంపై కోర్టు స్టే విధించిందని బలనిరూపణ నిలిపివేయాలని ఆర్డీవోను కోరగా బల నిరూపణ పూర్తయ్యిందని ఆర్డీవో ప్రకటించారు. మొత్తం 16 మంది కౌన్సిలర్లు ఉన్న ఈ మున్సిపాలిటీలో ఇప్పటికే ఒకరు మరణించగా, మరొకరు డిస్క్వాలిఫై అయ్యారు. ఎన్నికల ముందు వైస్‌చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో మొత్తం 11 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష పదవిని కోల్పోగా ఆమె స్థానంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెజ్జు సంగీతారాములును కొద్ది రోజుల్లో ఎంపిక చేయనున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు.



బుధవారం మీడియాతో మాట్లాడుతున్న కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

అసిస్టెంట్ పోస్టులు

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 300
- **పోస్టులు:** అసిస్టెంట్
- **అర్హతలు:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత
- **దర